.. ఆర్. ఎస్. ఎస్. లోతుపాతులు

ఈపుస్తకం ముద్రణ అయిన వెనువెంటనేఒక్క కన్నడ భాషలోనే
లక్షప్రతులు అమ్ముడుపోయాయి. అనేక ఇతర భాషలలోకి అనువాదమైంది. తొటి మనుషులు, సాటిజనం బాటుకులపట్ల, రాజ్యాంగం పట్ల విశ్వాసం, ఆసక్తి ఉన్న చింతనాపరులు తప్పక చదివితే, నాకష్టం ఫలవంతమైందని భావిస్తాను.

. తెలుగులో కూడాకొన్ని అనువాదాలు పుస్తక రూపంలో వచ్చాయి. స్వేచ్చాలోచన మాసపత్రిక కోసం నేను చేసిన అనువాదం రెండు సంచికలలో ప్రచురించారు. ఆసక్తి ఉన్నవాళ్లు షేర్ లేదా కాపీ పేస్ట్ చేసుకొని విరామ సమయంలో చదువుకోవచ్చు. లేదా ఒక డజను పుటలకు అటూఇటుగా ఉండే ఈ మొత్తం అనువాదాన్ని ప్రింట్ తీసుకొని చదువుకోవచ్చు (వివరంగా చదివేందుకు పట్టె సమయం సుమారుగా గంట)

ఆర్ ఎస్ ఎస్ లోతుపాతులు -దేవనూరు మహాదేవ.-యథాతథానువాదం- అనిసెట్టి శాయికుమా

ఈపుస్తకం ముద్రణ అయినవెంటనేఒక్క కన్నడ భాషలోనే లక్షప్రతులు అమ్ముడుపోయాయి. అనేకభాషలలోకి అనువాదమైంది. తెలుగులో కూడాకొన్ని అనువాదాలు పుస్తక రూపంలో వచ్చాయి. స్వేచ్చాలోచన మాసపత్రిక కోసం నేను చేసిన అనువాదం రెండు సంచికలలో ప్రచురించారు. ఆసక్తి ఉన్నవాళ్లు షేర్ చేసుకొని విరామ సమయంలో చదువుకోవచ్చు. లేదా ఒక డజను పుటలకు అటూఇటుగా ఉండే ఈ అనువాదాన్ని ప్రింట్ తీసుకొని చదువుకోవచ్చ- మూడు భాగాలుగా పెడుతున్న దాంట్లో ఇది చివరిభాగం
****

ఆర్ ఎస్ ఎస్ పచ్చి అబద్ధాల బతుకు

ఆర్ ఎస్ ఎస్ ముఖ్య నాయకునిగా గోల్వాల్కర్ దీర్ఘ కాలం పని చేశాడు. ఆర్ ఎస్ ఎస్ ను స్థాపించింది డా. హెడ్గెవార్. సావర్కార్ను తనగురువు, తాత్విక మార్గదర్శిగా అభివర్ణించాడు. అదేవిధంగా గోల్వాల్కర్ను కూడా. వీరిద్దరి రాతలు, భావాల్ని గురించి తెలుసుకునేందుకు వారిరాతలలోని కొన్ని భాగాలు కింద అందించడమయింది.

గోల్వాల్కర్ దృష్టిలో దేవుడు

“ మనలో దాగి ఉన్న శక్తిని ఉద్దీపింపజేసేందుకు సజీవంగా ఉన్న దేవుని అవసరముంది. అందువల్లనే మన పెద్దలు 'సమాజమే మన దేవాలయం అన్నారు. హిందూజాతి తనకు తానే ఆదిపురుషుడు, సర్వ శక్తివంతుడుఐన విరాట్ స్వరూపి.” వారు 'హిందూ' అనే పదాన్ని ఉపయోగించకపోయినప్పటికీ, పురుషసూక్తం ఈవిధంగా వర్ణించింది.- సూర్యచంద్రులు ఆ మాహా పురుషుని కళ్ళు. నక్షత్రాలు, ఆకాశమూ ఆయన భావనలోంచీ పుట్టేయి.(సహస్రశీర్షా పురుషః సహస్రాక్షఃసహస్రత స భూమిం విశ్వతో వృత్వాత్య్ అతిష్ఠద్ దశాఙ్గులమ్)ఈవిధంగా వర్నిస్తూ, బ్రాహ్మణులు తన తలభాగంగానూ, క్షత్రియులు తన భుజాలుగానూ వైశ్యులు తన తొడలుగాను, శూద్రులు తన పాదాలుగానూ చెప్పేరు. ఈ నాలుగు రకాల వర్ణ వ్యవస్థను అనుసరించేవారే హిందూ జాతి. అదే దైవం అనేదే ఇక్కడి భావం. (గోల్వాల్కర్ రాసిన, బెంగళూరులోని సాహిత్య సింధు మూడోసారి పునర్ముద్రించిన' చింతన గంగ' పుస్తకంలోని పే.29

గోల్వాకర్ రాజ్యాంగం

హిందువునని గర్వించమంటూప్రజల్లో విస్తృత వ్యాప్తి చేసిన అంశాన్ని రాస్తూ, ఒక ఫిలిప్పైన్ రాజాస్థానం మనువుకు ఒక పాలరాతి విగ్రహం ప్రతిష్టించి, దానికింద, “ మానవ జాతికి తొలిసారిగా న్యాయ చట్టాన్ని ప్రసాదించిన మహా మేధావి'గా రాసి ఉంచారు. (గోల్వాల్కర్ రాసిన, బెంగళూరులోని సాహిత్య సింధు మూడోసారి పునర్ముద్రించిన' చింతన గంగ' పుస్తకంలోని పే.12

సావర్కార్ దృష్టిలో

“మన హిందూ రాజ్యంలో వేదాల తర్వాత మనుస్మృతి పవిత్ర గ్రంధం. ప్రాచీనకాలం నుంచీ, మన సంస్కృతీ, ఆచారాలు, నమ్మకాలు, ఆలోచనావిధానాన్ని, చర్యలను, నైతిక సూత్రాలనూ సంపన్నవంతం చేస్తూ ఉంది. ఎన్నో శతాబ్దాలుగా కొనసాగుతూవస్తున్న మన దేశపు ఆధ్యాత్మిక దైవిక సంప్రదాయాల్ని అది సంకలనం చేసింది. ఈనాటికీ తమ అనుదిన జీవితంలో కోట్లాదిమంది హిందువులు పాటించే నియమ నిబంధనలకు మనుస్మృతిపునాదిగాఉంది. నేడు మను సంస్కృతేహైందవ న్యాయచట్టం. (సావర్కార్ సమగ్ర రచనలు లోని నాలుగో సంపుటిలోని 'మనుస్మృతిలో స్త్రీలు' అనే భాగం నుంచీ)

బాబా సాహెబ్ అంబేద్కర్ అద్వర్యంలో తయారైన భారత రాజ్యాంగంపై గోల్వాల్కర్

మన రాజ్యాంగం కూడా భిన్న పాశ్చాత్య దేశాల రాజ్యాంగాల లోని నానా రకాల అంశాలు కలగాపులగంగా, దేశీయతకుతావులేకుండా తయారు చేశారు. ఐక్యరాజ్య సమితి ప్రకటననుంచీకొన్నికుంటిసూత్రాలు, కొన్ని నానాజాతి సమితి భావాలు, అమెరికా, బ్రిటీషు రాజ్యాంగాలనుంచీ కొన్ని గందరగోళపు అంశాల్ని పొందుపరిచి కలగుర గంపగా మార్చారు. (గోల్వాల్కర్ రాసిన, బెంగళూరులోని సాహిత్య సింధు మూడోసారి పునర్ముద్రించిన' చింతన గంగ' పుస్తకంలోని పే.245)

ఆర్ ఎస్ ఎస్ కు బాకాగా పనిచేసే 'ఆర్గనైజర్' పత్రిక 1949, నవంబర్ 30 న ప్రచురించిన సంపాదకీయంలో,

1949, నవంబర్26 న, భారత దేశానికి కొత్త రాజ్యాంగాన్ని సమర్పించిన సందర్భంగా, రాజ్యాంగంపై ఆపత్రికలో కిందివిధంగా విమర్శ ప్రచురించారు. “ పురాతన భారతదేశ పాలనా చట్టాలను గురించిగానీ, సంస్థల్ని గురించిగానీ, పేర్లుగురించిగానీ ఆపదజాలపు చాయలుగానీ ఎక్కడా కనబడవు. మనుస్మ్ర్రుతిని గురించి పర్షియా లేదా స్పార్టా దేశాల్లో రాసుకున్నారు. ఈనాడు మనుధర్మశాస్త్రంలో చెప్పిన సూత్రాలు ప్రపంచం మెప్పు పొందేయి. హిందువులందరూ అప్రయత్నంగానే దానికి విధేయులై కట్టుబడి ఉన్నారు. ఐతే మన రాజ్యాంగ పండితులకు ఇదేమీ పట్టలేదు. “

సమాఖ్య రాజ్య పధ్ధతి గురించి

విషబీజం: "రాజ్యాంగంలోని 'రాజ్యాల సమాఖ్య' రూపం పెట్టి, మనది సుహృద్భావ ఏకీకృత రాజ్యం అనే అంశం రాజ్యాంగ కర్తల బుర్రకెక్కలేదు. వారు మన దేశాన్ని 'రాజ్యాల సమాఖ్య' గా పెరుపెట్టేరు. వీటన్నిటిమధ్యనా నేటి సమాఖ్య విధానం వేర్పాటు ధోరణి అనే కనబడని విషబీజాన్ని నాటేరు.” (గోల్వాల్కర్ రాసిన, బెంగళూరులోని సాహిత్య సింధు మూడోసారి పునర్ముద్రించిన' చింతన గంగ' పుస్తకంలోని పే.229)

“.... ఈ కారణం చేత, మంచి జరిగేందుకై ఈ సమాఖ్య రూపాన్నిలోతుగా గోయ్యితవ్వి పాతిపెట్టాలి. భారత్ అనే ఒకే ఒక రాజ్యంలో. స్వతంత్ర ప్రతిపత్తి లేదా పాక్షిక స్వతంత్ర ప్రతిపత్తి పేరిట ఉండే రాష్ట్రాల ఉనికిని తుడిచి పెట్టాలి. ఈ రకమైన కేంద్రీకృత పాలన ఉండే ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి రాజ్యాంగాన్ని పునఃపరిశీలించి తిరిగి రాయాలి. (గోల్వాల్కర్ రాసిన, బెంగళూరులోని సాహిత్య సింధు మూడోసారి పునర్ముద్రించిన' చింతన గంగ' పుస్తకంలోని పే.474)

ఆర్ ఎస్ ఎస్ కు ఉత్తేజం ఇచ్చేది

"ఈమహోన్నత దేశంలోని మూలమూలలా హిందూత్వ జ్వాల రగిలించడానికి ఒకే దేశం, ఒకే నాయకత్వం, ఒకే జండా అనేది మనకు ఉత్తెజకంగా ఉండాలి.” (గోల్వాల్కర్ రాసిన, బెంగళూరులోని సాహిత్య సింధు మూడోసారి పునర్ముద్రించిన' చింతన గంగ' పుస్తకంలోని పే 476)

నాజీ హిట్లర్ నిరంకుశజాత్యరకార భావజాలాన్ని గురించి

“ఈరోజున జర్మన్ జాతి గర్వం ప్రధాన అంశంగా ఉంది. తమ సంస్కృతీ, జాతి స్వచ్చతలనుకాపాడుకోవడా నికి అక్కడి ఆఫ్రో ఆసియా జాతుల వాళ్ళను, యూదులను పూర్తిగా నిర్మూలించి ప్రక్షాళన చేస్తోంది. జాతి గౌరవోన్నతులు ఇక్కడ గొప్పగా చెప్పేరు. మూలాల్లొకి వెళ్ళేట్లయితే, తేడాలతో ఉన్న భిన్న జాతులు సంస్కృతులు ఒకటికావడం ఎంత అసాధ్యమో జర్మనీ మనకు ఉదాహరణ చూపుతోంది. మనకు ఇదెంతో మంచి పాఠం. దీన్నుంచీ మన హిందూ దేశం ఎంతో నేర్చుకుని లాభపడాల్సుంది. “ (గోల్వాల్కర్ రాసిన 'మనం, మన జాతీయతకు నిర్వచనం1939 సం.)

"ఈయీపాతదేశాలు తమ అల్పసంఖ్యాక వర్గాల సమస్యను ఎట్లా పరిష్కరించుకున్నదీ మనం దృష్టిలో ఉంచుకోవడం ఎంతో అవసరం. దేశంలోకి వచ్చినవారు ప్రధాన జనస్రవంతితో సహజంగానే ఏకమవాలి. అక్కడి జాతి సంస్కృతి, భాష, అలవర్చుకొని, తమకున్న ప్రత్యెక ఉనికి, చైతన్యాన్ని, తమ విదేశీ అస్తిత్వాన్నీ పూర్తిగా మరచిపోయి వారి ఆశయాలలోమమేకం కావాలి. వాళ్ళు ఆవిధంగా చేయకపోతే, ఉన్న దేశంలోని చట్టాలు ఆచారాల్ని అనుసరిస్తూ వారక్కడ పరాయివారిగానే బతకాలి. వారికి ఏ రకమైన ప్రత్యెక రక్షణలుగానీ, హక్కులుగానీ ఉండవు. ఇట్లాంటి విదేశీ శక్తులకు రెండే మార్గాలున్నాయి. ఒకటి తమకు తాముగా అక్కడి జాతిలో కలిసిపోయి, వారి సంస్కృతిలో భాగమైనా కావాలి లేదా అక్కడి జాతివారి దయపై ఆధారపడి బతకనిచ్చినన్నాళ్ళుబతికి, ఎప్పుడు పొమ్మంటే అప్పుడు దేశం విడిచి పోవాలి. అల్పసంఖ్యాకవర్గాల సమస్యకు ఇదొక్కటే పరిష్కారం. అదొక్కటే తర్కబద్ధమైన, సరైన పరిష్కారం. ఈవిధానమొక్కటే జాతి జీవనాన్ని ఆరోగ్యవంతంగా, కలతలు లేకుండా ఉంచే మార్గం. ఒక రాజ్యంలో మరొక రాజ్యాన్ని ఏర్పాటు చేసే కేన్సర్ పెరుగుదలవంటి ప్రమాదకర స్థితినుంచీ జాతిని కాపాడే మార్గం ఇదొక్కటే. “ (గోల్వాల్కర్ రాసిన 'మనం, మన జాతీయతకు నిర్వచనం1939 సం.)

“నాజీ జాత్యహంకార మంత్రదండం వల్లనే అద్భుతంగా కోలుకొని అంతకుముందెన్నడూలేని విధంగా జర్మనీ ఇటలీలుశక్తివంతంగా ఎదిగాయి. వారి ఆర్రోగ్య రక్షణకు ఈసిద్ధాంతాలే గొప్ప బలవర్ధక ఔషధంగా పనిచేసేయని రుజువుచెయ్యడానికి ఈ ఉదాహరణేచాలు. “(హిందూ మహాసభ 1940 లో మదురైలో జరిపిన సభలో వి.డి. సావర్కార్ అద్యక్షోపన్యాసం.)

వారి ఆధార పత్రాలు చెప్పే వాస్తవాలు

ఆర్ ఎస్ ఎస్ పచ్చి అబద్ధాల బతుకు అనే పై అధ్యాయంలో, ఆసంస్థ ప్రధాన నాయకులు గోల్వాల్కర్, సావర్కార్ల రాతల్లోని కొన్ని ఎత్తిచూపిన, వారి భావాలు, దృష్టి కోణాలకు సంబంధించిన అంశాలున్నాయి. అంతవరకూ ఆ పత్రాలె వివరించాయి. బుద్ధి కలిగిన బ్రాహ్హ్మణుడు ఎవడూ ఆర్ ఎస్ ఎస్ రాక్షస గతాన్ని ఎప్పుడూఒప్పుకోడు.

తన పుస్తకానికి గోల్వాల్కర్ 'బంచ్ ఆఫ్ థాట్స్' అని పేరు పెట్టాడు. ఈ
పుస్తకం మొత్తం పూర్తిగా 'ఆలోచన' అనే పదానికి దగ్గరగా ఉండే అంశం ఎకొంచం కూడా ఎక్కడా కనబడదు. ఆ పుస్తకమంతా మూడు అంశాలు, ప్రమాదకర నమ్మకాలు మాత్రమె కనబడతాయి. అదికూడా, గతకాలానికి సంబంధించిన హానికర నమ్మకాలు. ఇప్పటికి వందసంవత్సరాలనుంచీ, ఆర్ ఎస్ ఎస్, దాని తోటి సంఘాలు, ఆప్రమాదకర గతం నుంచీ నేటి వాస్తవాన్ని రూపుదిద్దించడానికి నిరంతరాయంగా కృషి చేస్తూనె ఉన్నాయి.

ఆర్ ఎస్ ఎస్ నమ్మకాలకు సంబంధించి ముఖ్యంగా, ఋగ్వేదంలోని పురుష సూక్తంలో చెప్పిన చాతుర్వర్ణవ్యవస్థ వారికి ప్రధమ ఆదర్శం. బ్రాహ్మణులుతలనుంచీ, రాజులు భుజాలనుంచీ, వైశ్యులు తోడలనుంచీ, శూద్రులు కాళ్ళ వద్దనూ ఉండే అసమానతలతో కూడిన సామాజిక నిర్మాణమే వారికి దైవం. ఇదే సావర్కార్ కు ఆదర్శ రూపం. ఈ సామాజిక వ్యవస్థనే సజీవ దైవంగా అభివర్ణించాడు. ఈ దృక్పధమే ఆర్ ఎస్ ఎస్ కు పునాది. వారికి ఇదే భగవద్స్వరూపం. దైవ స్వరూపానికి ప్రతిరూపమైన చాతుర్వర్ణ వ్యవస్తకు పరిశీలించే ప్రయత్నంలో ముందుగా మన సొంత శరీరంలోని తల, భుజాలు, తొడలు, కాళ్ళను పరిశీలిద్దాం. మొత్తం శరీరాన్ని ఆజ్ఞాపించేదితల. అంటే మెదడు భుజాలు, తొడలు, కాళ్ళు, దీని ఆజ్నప్రకారం నడుచుకోవాలి. దీన్ని మనం

సమాజానికి అనువర్ర్తించేట్లయితే, ఈ క్రమం ప్రకారం బ్రాహ్మణులు(తల) క్షత్రియులు (చేతులు) మాత్రమె పాలించాలి. అదేవిధంగా, వైశ్యులు వ్యాపారం చేయాలి. మిగిలిన శూద్రులు అందరికీ ఊడిగంచేయాలి. ఆర్ ఎస్ ఎస్ సిద్దాన్తాలప్రకారంఇదే సామరస్యంతో కూడిన సామాజిక న్యాయం. ఇదే దైవ స్వరూపం. వాస్తవంగా సజీవ దైవం.

బిజెపిపాలిత రాష్ట్రాలలో పిల్లల మెదళ్ళలో దీన్ని బాగా ఎక్కించడానికి, 'నాలుగు వర్ణాలునాలోనుంచే ఉద్భవించాయి.' అని శ్రీ కృష్ణుడు ప్రకటించిన భగవద్గీతను పాఠ్యాంశాలలో చేర్చారు. భగవద్గీత ఎప్పుడు రాశారు? దాని అసలు ప్రతిలో కృష్ణుడు చాటుర్వర్ణవ్యవస్థను పేర్కోవడం జరిగిందా? లేదా గీతలో దీన్ని అనంతరకాలంలో చేర్చడం జరిగిందా? అది తర్వాతి కాలంలో చేర్చిన్దయితే, దాన్ని ఎప్పుడు చేర్చారు? ఈ అమ్శాలన్నీ కచ్చితంగా పరిశీలించాల్సిందే.

ఈ అంశంలో, గీత కున్న అధికారతను గురించి స్వామి వివేకానంద ఇట్లా పేర్కొన్నాడు. ...” భగవద్గీతపై శంకరాచార్యుడు వివరణాత్మక వ్యాఖ్యానం రాసి, దాని ఖ్యాతిని విస్తృతంగా వ్యాపింపజేసేదాకా దాన్ని గురించి ఎవరికీ తెలియదు. ఎంతోకాలం కిందట శంకరాచార్యుడు అనేక ఇతర పండితుల అభిప్రాయంలో 'భోధయాన వ్రుత్తి' పేరిట ఉండేది. ఈ 'భోధయాన వ్రుత్తి' వేదాంత సూత్రాలపై ఆధారపడి వుంది. కొంతమంది సంకరాచార్యుడే దీన్ని రాసినట్టుగా అభిప్రాయపడుతున్నారు. శంకరాచార్యుడే దీన్ని మహాభారతంలో ప్రక్షేపించినట్లు ఒక అభిప్రాయం ఉంది.” (స్వామి వివేకానంద కృతిశ్రేణి ఏడవసంపుటి, పే.80- 81; శ్రీరామకృష్ణ ఆశ్రమ ప్రచురణలు) వివక్షాపూరిత చాతుర్వర్ణ వ్యవస్థ భావాల్ని దేవునికి అనువర్తించి దీన్ని న్యాయబద్ధం చేయడానికి అనంతర కాలంలో జరిగిన ప్రయత్నాలుగా వివేకానందుని సొంత మాటలద్వారానే మనకు తెలియడంలేదా! వారి నమ్మకాలే చరిత్ర. వారిమాతలే శిలాశాసనాలు. వారికి సత్యం అనవసరం. వారనుకునేదే నిజం. వారి నమ్మకాలే వర్తమాన వాస్తవాలుగా చెలామణీ కావాలి. వారు దీని విజయాన్ని ఆస్వాదించడం ఎక్కువఎకొందికీ ఇది మన రాజ్యాంగానికి ఎంతో హాని చేస్తుంది.

కాబట్టి, ఈ నిర్దిష్ట హిందూ వాదులకు, భారత దేశంలో ఒక విశ్వ పౌరునిగా జన్మించే బిడ్డ కచ్చితంగా జాతి వర్ణ వ్యవస్థ పరిధిలో చచ్చేదాకా కట్టుబడి ఉండాలి. బాబాసాహెబ్ అంబేద్కర్ నాయకత్వం కిందపౌర హక్కులు, మానవవాద భావాలతో ఊపిరిపొసుకున్న వర్తమాన రాజ్యాంగం వాస్తవానికి ఓ పీడకల. ఇదివారికి నిద్రలేకుండా చేస్తుంది. ఆర్ ఎస్ ఎస్, దాని పరివారమూమన రాజ్యాంగాన్ని నాశనం చేయడానికి ఎదురులేని చర్యలకు పాల్బడుతున్నారు. ఈ లక్ష్యం దిశగా అనేకరకాల దుశ్చర్యలకు పాల్బడుతున్నారు.

మన రాజ్యాంగపు పునాదినీ, రాష్ట్రాల కూటమిగా ఉన్న దాని సమాఖ్య
స్వభావాన్నీ, దెబ్బతీసేందుకు ఆర్ ఎస్ ఎస్,పరివారం మద్దతు కూడగట్టుకొంటోంది. ఆర్ ఎస్ ఎస్ దృష్టిలో భిన్నత్వం అంటే ఓగాయం, వేర్పాటువాదం, ఒక విషబీజం. 'మన రాజ్యాంగంలోని సమాఖ్య రూపాన్ని లోతుగా గొయ్యితీసి పాతిపెట్టాలి. రాజ్యాంగాన్ని మళ్ళీపరీక్షకుగురిచేసి, ఏకీకృత ప్రభుత్వం స్థాపించాలి ' అని గోల్వాల్కర్ ప్రకటించాడు. అంతేకాకుండా, ఒక దేశం, ఒకే జెండా అనే సిద్ధాంతాన్ని, హిట్లర్ చెప్పిన ఒకే జాతి, ఒకే నాయకత్వం, అన్నిరకాల శక్తివంతమైన అధికార పాలనను స్థాపించడం వారి లక్ష్యం.

గతాన్ని ఒక్కసారి గుర్తుచేసుకుంటే, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఇందిరాగాంధీనికూడా క్లుప్తంగా నిరంకుశురాలిగాచెప్పుకోవచ్చు. అది చాలా కొద్దికాలం మాత్రమె. తన నిరంకుశత్వం పరిపాలనకే పరిమితం.

ఇందిరాగాంధీ కొద్దికాలం సాగించిన నిరంకుశ పాలనలో, న్యాయవ్యవస్థ, పాలనాయంత్రాంగం, పత్రికలు, ఇతర స్వతంత్ర సంస్థలు ఈనాడు తయారైనంత నిర్వీర్యం కాలేదనే విషయం మనం గుర్తుచేసుకోవాలి. ప్రస్తుత మొదీ పాలనలో, న్యాయ వ్యవస్థ,

కార్యనిర్వాహక వర్గం, ప్రసార ప్రచురణ మాధ్యమాలు మనుగడకోసం పోరాడాల్సిన, మరింత దిగజారిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఆర్ ఎస్ ఎస్ కలలుగన్న పాలన మన సమాజంలో అన్ని చోట్లకూ విస్తరిస్తోంది. అంటే, వారు రాజకీయ పక్షాల్ని, కార్యనిర్వాహక వర్గాన్నీ, సమాజాన్ని, సంస్కృతినీ అన్నిటినీ ఎలాలనుకుంటున్నారు. ఇది సర్వ వ్యాపిత, నిరోధించలేని అధికారం!దీన్ని గుర్తుచేసుకుందాం.

ఇదంతా ఏ ప్రయోజనం కోసం? చాతుర్వర్ణ ప్రాతిపదికన ఉండే సమాజ స్తాపనకా, మనువు ధర్మ శాస్త్ర ప్రాతిపదికన పనిచేసే రాజ్యాంగ చట్టాన్ని తేవదానికా, సంస్కృతాన్ని అనుదినం వాడే భాషగా రుద్దదానికా లేదా అంధ యుగపు గతాన్ని తిరిగి స్థాపించి వర్తమానంలో దాన్ని రుద్దదానికా! సంస్కృతాన్ని జనాల నెత్తిన రుద్దే విషయమై "సంస్కృతం ఈ స్థాయిని సాధించేదాకా, హిందీ భాషకు అత్యంత ప్రాధాన్య ఇవ్వాలి!” అని గోల్వాల్కర్ ప్రకటించాడు. ఇదంతా ఓవికృత క్రీడ!

ఆర్ ఎస్ ఎస్ కున్న మూడో నమ్మకాన్ని చూస్తే- ఆర్యజాతి ఔన్నత్యసిద్ధాంతం. ఇదివారి స్వీయ భావావరోధం. ఇక్కడ కూడా క్రూర నియంత, ఆరజాత్యహంకారహిట్లర్ ను ఆదర్శంగా తీసుకుని, ఆ భావాల్ని ఆమోదిస్తున్నది. జాతి సంకరం కాకూడదనే జాతి సుద్ధి కార్యక్రమాన్ని గురించి హిట్లర్ కంటే ఓ అడుగు మున్దేసిన గోల్వాల్కర్ నిత్యమైన భారత దేశంలో ఆర్యుల వంశ శుద్ధత నిలిపే కార్యక్రమాలు పురాతన కాలం నుంచీ జరుగుతున్నాయన్నాడు. గుజరాత్ విశ్వవిద్యాలయంలోని విద్యార్ధులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, గోల్వాల్కర్ ఇలా అన్నాడు. “ ఇవేళ సంకరజాతి ఉత్పత్తి కేవలం జంతువులకు మాత్రమె జరపడంఔతున్నది. ఈరకమైన ప్రయోగాలను మానవులపై జరిపే సాహసాన్ని శాస్త్రవేత్తలుగా అనుకున్తున్నవారు చేయడం లేదు. ఈరోజున మనుషుల్లోఎక్కడైనా మనకు సంకరజాతి కనబడుతోందంటే అది శాస్త్రీయ ప్రయోగం కాదు. కేవలం కామవాంచ తీర్చుకునే క్రమంలోనే ఇది జరుగుతోంది. ఈ రంగంలో మన పూర్వికులుచేసిన ప్రయోగాల్ని చూద్దాం. సంకరపరచడంద్వారామానవ జాతిని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో భాగంగా, ఉత్తర భారత దేశానికి న్చెండిన నంబూద్రి బ్రాహ్మణులు కేరళకు వలస వెళ్లి, అక్కడో నియమ ప్రవేశపెట్టేరు. ఆప్రకారం, నంబూద్రి బ్రాహ్మణ కుటుంబంలోని పెద్దకొడుకు కేవలం వైశ్య, క్షత్రియ లేదా సుఉద్ర కులాలకు చెందిన కేరళ అమ్మాయిని మాత్రమె పెళ్లి చేసుకోవాలి. ఇప్పటికీ గొప్ప సాహసోపేతమైన నిర్ణయంగా మరచిపోలేని ఉత్తరువు, ఏకులానికిచెందిన వివాహితురాలయినా మొదటి బిడ్డను నంబూద్రి బ్రాహ్మణుడి వల్లనే కనాలి. తరువాతి సంతానాన్ని మాత్రమె భర్త ద్వార కనవచ్చు. ఈరోజు ఈ ప్రయోగాన్ని రంకుతనంగా పిలుస్తున్నారుకానీ, వాస్తవానికి అది మొదటి బిడ్డకే పరిమితమైం కాబట్టి అదిఅది అలా కాదు.” (1961 జనవరి 2 న ఆర్గనైజర్ పత్రికలో ప్రచురించిన గోల్వాల్కర్ ఉపన్యాసం)

ఇక్కడో వ్యంగ్య పరిహాసముంది. గుజరాత్ విశ్వవిద్యాలయంలో తన జన్యుశాస్త్ర జ్ఞానాన్ని బహిరంగంగా ప్రదర్శించిన తరువాత, అనంతరకాలంలో ఆర్ ఎస్ ఎస్ అధికారిక ప్రచురణలయిన ఆర్గనైజర్ పత్రికలో గోల్వాల్కర్ దాన్ని వెనక్కు తీసుకున్నాడు. అయినప్పటికీ, అప్పటికే అది ప్రచురితమై నమోదయిపోయింది. తను తన వాదననుంచీవెనక్కు తగ్గినా, అంతకు ముందు చెప్పింది తప్పయిపోతుండా? కానీ సమ్మోహనకరమైన అతని ప్రకటన మెదడుపై ప్రభావాన్ని చూపి ఉంటుంది. ఆయన దాన్ని తన వ్యక్తిగత అంశంగా చూపేడు. ఈరకమైన ద్వంద్వ వైఖరి ప్రదర్శించడంద్వారా గోల్వాల్కర్ తప్పుడు బీజాల్ని నాటి, అది కలుపుగాడ్డిలా అంతటా విస్తరించడానికి దోహద పడ్డాడు. ఆరకమైన విషబీజాలు వాట్సాప్, ఫేస్బుక్, వార్తాపత్రికలు, బహిరంగ ఉపన్యాసాలద్వారా ఈనాటికీ సజీవంగా నిలబడుతున్నాయి. ఈరకమైన తప్పుడు కథనాల్ని నమ్మి మన మెదళ్ళలో విషబీజాలు నాటే విధానాన్ని బహుమానంగా అందించినవాడు మాత్రం గోల్వల్కరే! ఆర్ ఎస్ ఎస్, దాని పరివారంగా ఉన్న ఇతర సంస్థలు అవిశ్రాంతంగా, నిరంతరాయంగా వ్యాపిమ్పజేస్తూనే ఉన్నాయి.

ముందుగా, చాతుర్వర్ణ వ్యవస్థను తన దైవంగా భావించే ఆర్ ఎస్ ఎస్, భారత దేశంలో పుట్టిన, చాతుర్వర్ణ వ్యవస్థకు అవరోధంగా ఉండే జైన, బౌద్ధ, లింగాయత మతాల్ని ఇక్కడ తుడిచిపెట్టేందుకు ప్రయత్నం చేస్తోంది. చాతుర్వర్ణ వ్యవస్థను పరిరక్షించుకొని కొనసాగెట్లు చేయడానికి ఆ మతాల్ని నిర్వీర్యం చేసేందుకు కృషి చేస్తున్నారు. అందుకై వారు ఈయీ మతాల్ని కూడా స్వంతం చేసుకొని వాటిని చాతుర్వర్ణ వ్యవస్థలో భాగంగంగా చేసే ప్రయత్నం సాగుతోంది. మరోవైపు, హిందూ చాతుర్వర్ణ వ్యవస్థను ఆపాదించడానికి అవకాశంలేని ఇస్లాం, క్రైస్తవ మతాల్ని నలిపివేసేందుకు తమ పరివారాన్ని ఉసిగోలుపుతున్నాయి. ఈ రకమైన దౌర్జన్యాలు భిన్న రకాలుగా ఉన్నాయి. ఇవి ఇటీవల ప్రారంభమైనవి కావు. ఈ మోసపూరిత చర్యల్ని గురించి ఒక ఉదంతం చెప్పుకోవాలి. గతంలో 1948 మార్చ్ 14 న నాటి దేశాధ్యక్షుడు బాబూ రాజేంద్రప్రసాద్ ప్రధానమంత్రి నెహ్రూకు, హోంమినిస్టర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ కు ఒక లేఖ రాస్తూ, అందులో ఇట్లా హెచ్చరించాడు. -”ప్రజలమధ్య చిచ్చు పెట్టడానికి ఆర్ ఎస్ ఎస్ వేస్తున్న పధకాల్ని గురించి నాకు తెలియవచ్చింది. వారిలో చాలామంది ముస్లిం వేషాలు వేసుకొని సాయిబుల్లా కనబదుతూ, హిందువులపై దాడిచేస్తూ వారిని ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నారు. అదేవిధంగా వాళ్ళలో కొందరు హిందువులు ముస్లింలపై దాడిచేసి వారిని రెచ్చగొడుతున్నారు. హిందూ ముస్లిముల మధ్య చిచ్చు పెట్టడానికి గొడవలు సృష్టించడానికి కారణమవుతున్నారు. (నేషనల్ బుక్ ట్రస్ట్ డిల్లి ప్రచురించిన, నీరజ్ సింగ్ పేర్కొన్న, నెహ్రు పటేల్ ల ఎంపిక చేసిన పత్రాలు పే.43) అప్పటికే వారి మొసపూరిత చర్యలు ఆవిధంగా ఉండేవి. నేటికీ వారినుంచీ అంతకుమించి ఏమి ఆశించగలం? ఎన్ని దొంగవేషాలు?

అవి చాతుర్వర్ణ సామాజిక వ్యవస్థ చట్రంలో ఇమడకపోవడమే ఇస్లాం, క్రైస్తవ మతాలపై ఆర్ ఎస్ ఎస్ ద్వేషానికి ప్రధాన కారణం. ముఖ్యంగా ఈ మతాలు హైందవ చాతుర్వర్ణ వ్యవస్థను జీర్ణించుకోడానికి వల్లకానివి. ఈరెండు మతాల్నీ ఎట్లానైనా మెడలువంచి, వాటిని నిర్జీవంగా మార్చి, ఆమతంవారికి ఎలాంటి హక్కులూ లేకుండా ఎదోకరకంగా చేయాలనేదే ఆర్ ఎస్ ఎస్ ఉద్దేశం. గోల్వాల్కర్ 'మనం మన జాతీయతా నిర్వచనం' అనే పుస్తకంలో ఈ విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పేడు. “... బయటినుంచీ వలస వచ్చినవారు ఎవరైనాసరే, తమ ప్రత్యెక అస్తిత్వాన్ని, విదేశీ మూలాల్నీ పూర్తిగా మరిచిపోయి, సహజంగాఇక్కడి జాతిలో కలిసిపోవాలి. విదేశీ వ్యక్తికి రెండే రెండు మార్గాలున్నాయి. వారు ఇక్కడి జాతిలో కలిసిపోయి ఇక్కడి సంస్కృతిని తమదిగా చేసుకోవాలి లేదా స్థానిక జాతి దయాదాక్షిణ్యాలపైఆధారపడి బతకనిచ్చినంతకాలం బతకాలి. వద్దంటే దేశం విడిచి వెళ్లిపోవాలి. ఇది హిట్లర్ జాత్యహంకార స్వభావానికి ఏమాత్రం తీసిపోదు.

ఆర్ ఎస్ ఎస్ దాని పరివార సంఘాలు ఎట్లాంటి మోసపూరిత ప్రచారాలకు ఒక చక్కని వివరణ చూద్దాం. టిప్పు సుల్తాన్ ను అగౌరవపరిచేందుకు వారు చేసిన ప్రయత్నం. టిప్పుసుల్తాన్ పాలనా కాలం 1982 నుంచీ 1799. కొడగు (ఇప్పటి కూర్గ్) జిల్లాలో అరవై తొమ్మిది వేలమంది హిందువులను టిప్పు సుల్తాన్ ముస్లిములుగా మతమార్పిడి చేయించినట్లుగా సంఘ్ పరివార్ ఆర్ ఎస్ ఎస్ పండితుల వాదన. వాస్తవానికి అక్కడి జనాభా వివరాలుఅక్కడి గజిట్ లలో పరిసీలించేట్లయితే, ఆసమయంలో కూర్గ్ జిల్లా మొత్తం జనాభా ఏనాడు అరవైతోమ్మిది వేలకు మించినట్లుగా లేదు. ఒకవేళ వాళ్ళు చెప్పేదే గనుక నిజమైతే, ఇప్పుడు కోడగ్ జిల్లా ప్రజలంతా ముస్లింలుగా ఉండాలి. కానీ ఇప్పుడు వాస్తవ లెక్కలప్రకారం కోడగ్ లో ముస్లింల జనాభా పదిహేను శాతానికి మించి లేదు. ఈ విషయం ఆర్ ఎస్ ఎస్ వారికళ్ళకు కనబడదు. వారికి ఇది ఏమాత్రం వింతగా కనబడదు. మోసపూరితవిషబీజాలునాటి వాటి పెరుగుదలను చుస్తూ ఉండడమే వారిపని. ఇవి ఇంకా పెరుగుతుండడం బాధాకరం. ఈ రకమైన పితలాటకాన్ని ఆర్ ఎస్ ఎస్ వారు ఇంకా పండిస్తూనె ఉన్నారు. వారిలో ఏమాత్రం దైవత్వం లేదనడానికి ఇదే సాక్ష్యం. మోసమే వారి దైవం.

మనం వాస్తవాలు పరిసీలించేట్లయితే, ఈ దేశంలో ఉన్న ముస్లిములు, క్రైస్తవులు అంతా విదేశాలనుంచీ వలస వచ్చారా? వీరిలోని అత్యధికులు కుల వ్యవస్థ, చాతుర్వర్ణ వ్యవస్థ వలన అణచివేతకు గురై, మతం మారలేదా? అయినప్పటికీ, ఇస్లాం భారత దేశంలోకి కొత్తగా ప్రవేశించిన రోజుల్లో అధికారం, పాలన, సైనిక గౌరవాలకోసం ఇస్లాం పాలకుల ప్రాపుకోసం ఉత్తరాది ఆర్య బ్రాహ్మణులు ఇస్లాం మతం పుచ్చుకోలేదా? ఇప్పుడు ఆర్ ఎస్ ఎస్ అసహ్యించుకునే పాకీస్తాన్ ముస్లిం లలో ఎంతోమంది అలా మతం మార్చుకున్న ఆర్య బ్రాహ్మణులు లేరా? వారికి ఈ వాస్తవాలేమీ అక్కరలేదు. కనీసం, వెనకటి హిందువులు నేడు ముస్లింలుగా ఉన్న వాస్తవాన్ని చూడరా? ఇవేవీ వారికి పట్టవు. ప్రతీ ఒక్కరూ ప్రత్య్రేకంగా హిందూ చాతుర్వర్ణ వ్యవస్థ ముందు మోకరిల్లాలనేదే వారి ఆకాంక్ష. ఈ కారణం చేతనే అత్యధిక సంఖ్యాకులైన ఉదారవాద హిందువులను మోసం చేస్తూ మొత్తం మతానికి తామే ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు, హిందువుల చాతుర్వర్ణ వ్యవస్థకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెపుతున్నారు. ముస్లిములు క్రైస్తవులను వేరుచేసేందుకు శూద్రులని తమ సైన్యంగా చేర్చుకుంటున్నారు.

చాలా జాగ్రత్తగా పరిశీలించాల్సిన ఆర్ ఎస్ ఎస్ మన దృష్టిని ఆకర్షించే కొన్ని ఇతర అంశాల్ని చూద్దాం. పురాతన కాలపు దారుణ సిద్ధాంతాలు వెలికితీసి, వాటిని వర్తమానంలోకి తెచ్చేందుకు చేసే కృషిలో ఆర్ ఎస్ ఎస్ ఒక్కటే లేదు. దీనికో పెద్ద వ్యవస్థే ఉంది. ఆర్ ఎస్ ఎస్ ప్రధాన ప్రచురణ సంస్థ 1977 లో ప్రచురించిన 'పరమ వైభవ కీ పద్పర్' అనేదాంట్లో అన్ని వివరాలూ ఉన్నాయి. బి జె పి, అఖిల భారతీయ విద్యార్ధి పరిషద్, (ఎబీవీపి) హిందూ జాగరణ్ మంచ్, విశ్వ హిందూ పరిషద్, భజరంగ్ దళ్ తదితర నలబై సంస్థలు దీనికి అనుబంధంగా ఉన్నాయి. ఈ పుస్తకంలో వీటన్నిటి జాబితా పొందుపరిచేరు. ఈ సంఖ్యా 1996 లోది. ఇంకా కొత్తగా ఎన్ని పుట్టుకోచ్చిండీ తెలియదు. 'ధర్మ సంసద్' అనే అతిపెద్ద మత మహాసభ కూడా ఆర్ ఎస్ ఎస్ గొడుగు కింద చేరింది. కర్నాటక బజరంగ దళ్ నుంచీ పుట్టిన శ్రీరామసేన కూడా వీటిలో ఉంది. వీరి చేష్టల వల్ల ఎప్పుడు వాటిలో దేనితో నైన ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సివచ్చినపుడు వాటితో తమకు ఎటువంటి సంబంధాలు లేవని చెబుతారు. అంతరంగికంగా ఇవన్నీ ఆర్ ఎస్ ఎస్ తో సంబంధాలు కలిగి ఉంటాయి.

ఆర్ ఎస్ ఎస్ ను గురించిన భయంకరమైన నిజమేమంటే, తమ పట్టు కిందకు
వచ్చినవారిని తమసంస్తలో స్వచ్చంద సేవకులుగా మలుచుకోవడానికి అవలంభించే విధానాలు. గోల్వాల్కర్ మాటల్లో....

“మన సంస్థలో భాగంగా మారి దాని ఆచార పద్ధతులకు కట్టుబడిఉన్న క్షణం నుంచీ, ఇక మన జీవితాల్లో ప్రశ్నించే అవకాశం లేదు. నీకు చెప్పిన ప్రకారం, మారు మాట్లాడకుండా చేయాల్సిందే. నిన్ను కబాడీ ఆడమని చెప్పినా, ఒక సమావేశం ఏర్పాటు చేయమన్నా, సిరసావహించాల్సిందే. మనమిత్రుల్లో ఎవరినైనా రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనమని చెప్పినపుడు, వారు నీళ్ళలో లేని చేపలాగా చావకూదదు. వాళ్ళను రాజకీయాల్లోంచీ బయటకు రమ్మనేట్లయితే వారు అభ్యంతరపెట్టకూడడు. వారి నిర్ణయించుకోవడానికి అవకాశం లేదు. (వార్ధా లోని సింది వద్ద 1954 మార్చ్ 16 న జరిగిన సమావేశంలో గోల్వాల్కర్ ఉపన్యాసం)

ఇక్కడ వ్యక్తీ స్వంతగా ఆలోచించి నిర్ణయం తీసుకోవడాన్ని గోల్వాల్కర్ వ్యతిరేకించాడు. వ్యక్తిగత ఎంపికనుకూడా తోసిపుచ్చాడు. ఇక్కడ కష్టమనిపించే విషయమేమంటే, యువతను ఈ సంస్థలో చేరాలని బలవంతం చేయడం. వారు జనాల్ని సంసిద్ధం చేయరు. స్వయం సేవకుల (ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు)పేరిట అమానవీయ యంత్రాలని సృష్టిస్తున్నారు. వాళ్ళ వలలో తగులుకోకుండా పిల్లల్ని ఎట్లా కాపాడులోవాలి?

ఈ కష్టకాలంలో చాతుర్వర్ణ సమాజం పేరిట జరిపే ఆటవిక చర్యల్ని ఊరికే చూస్తూ నిల్చోకుండా, విశాలమైన హిందూ సమాజంలో అల్ప సంఖ్యాకులుగా, గొర్రెల మందలో మేకవన్నె పులుల్లా ఉన్న ఉన్నవీరి అరాచకాలపై హిందూ సమాజం మొత్తం నోరు

విప్పాల్సిన అవసరముంది. విస్తృత హిందూ మానవ సమాజ, బ్రాహ్మణులు, ఆదివాసులు, తదితరులతో కలిపి ఎనిమిది కులాలు కలిపి దీన్ని మట్టుపెట్టాలి.

ఆర్ ఎస్ ఎస్ నుంచీ పుట్టిన బి జె పి కేంద్రంలోను, కర్ణాటకతో సహా కొన్ని రాష్ట్రాలలోనూ అధికారంలో ఉంది. ఎమార్గంలోనైనాగానీ అది అధికారం చేజిక్కించుకుంది. ఆత్యయిక పరిస్తితి విధించిన 1975 సం. లో, ఇందిరాగాంధీ నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ జయప్రకాశ్ నారాయణ చేపట్టిన ఉద్యమంలోకి జొరబడింది. ఆనాటి నుంచీ దాని స్వరూపం పూర్తిగా మారింది. గతంలో సామాజిక తిరస్కరణకు గురైన బి జె పి క్రమంగా ఆమోదాన్ని పొందడం మొదలయింది. జయప్రకాష్ నారాయణ కొత్తగా పెట్టిన జనతా పార్టీలో చేరిననాటి జనసంఘ్ (తర్వాత బి జె పి గా మారింది) ద్వంద సభ్యత్వం (అటు ఆర్ ఎస్ ఎస్ లో. ఇటు బి జె పి లో) ఉండే పధ్ధతి వదలివేస్తామని వాగ్దానం చేసింది. ఇట్లా వాగ్దానం చేసిన ప్రముఖుల్లో, ఏ బీ వాజ్ పాయీ, ఎల్.కే. అద్వానీ, ఆపై ఆర్ ఎస్ ఎస్ ముఖ్యుడు బాలాసాహెబ్ దేవరస్ వంటివారున్నారు. జయప్రకాష్ నారాయణ్ వాళ్ళను నమ్మేడు. వాళ్ళు జనతా పార్టీతో ఎంత రాసుకు పూసుకు తిరిగినా, ఆర్ ఎస్ ఎస్ తో వారికున్న అనుబంధాన్ని వదులుకోలేదు. రెండిటిలోనూ కొనసాగుతూ, ద్వంద సభ్యత్వాన్ని వదులుకుంటామన్న వాగ్దానాన్ని భంగపరిచారు. . . జయప్రకాష్ నారాయణ్ ను మోసం చేసి అతని నమ్మకానికి వెన్నుపోటు పొడిచారు. తర్వాతి సంవత్సరాల్లో దీన్ని గురించి బాధ పడుతూ, జయప్రకాష్ నారాయణ్ తనను వాళ్ళు మోసం చేసారని అన్నాడు. (ఆత్యయిక పరిస్థితి విధించిన 1975 సం. లో జయప్రకాశ్ నారాయణ్ ను చండీగర్ లో గృహనిర్బంధంలో ఉంచినపుడు, ప్రభుత్వం దీన్ని పర్యవేక్షించేందుకు దేవసహాయం అనే కలక్టర్ ను నియమించింది. ఆయనతో జయప్రకాష్ నారాయణ్చెప్పిన ఈ మాటల్ని ఒక ఇంటర్వ్యూలో 2019 జూన్ 26 న న్యూస్ క్లిక్ అనే ఆన్లైన్ పత్రికలో ప్రచురించారు.

ఇక అప్పటినుంచీ, ఆర్ ఎస్ ఎస్, బీ జె పి సంఘ్ పరివార్ ల మోసపూరిత వ్యవస్థ దేశం మొత్తం విస్తృతంగా అల్లుకుంది. అప్పట్నుంచీచిన్న చిన్న గొడవలతో సహా ప్రతిదానికీ పాకీస్తాన్ ను బూచిగాచూపి, రాజ్యానికి శత్రువుగా ప్రచారం చేసి, హిందూ ముస్లిం తగాదాలు రెచ్చగొట్టి, సమాజంలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించి, గందరగోళం, అనిశ్చిత పరిస్థితుల్లో అధికారం కైవసం చేసుకుంది. ఇప్పుడు వందలాదిమంది సంపన్నులకు, భిన్న మతవిభాగాల, సంప్రదాయాల వారికీ ఒకప్పుడు గొడుగులాతయారయారు.

అధికారంలోకి వచ్చేముందు బి జె పి ఎన్నిరకాల వాగ్దానాలు చేసింది? ఎయే వేషాలు వేసింది? అడగడానికి అవి ఒకటా రెండా? దేశం నుంచీ తరలిపోయి విదేశీ బాంకుల్లో మూలుగుతున్న నల్ల ధనాన్ని వెలికితీసి, ఒక్కో పౌరుని కాతాలో పదిహేను లక్షల రూపాయల చప్పున వేస్తానని వాగ్దానం చేసింది. ఈమాటలు నరేంద్ర దామోదర్ మోడీ స్వయంగా చెప్పేడు. ఎవరికాతాలోనైనా డబ్బులు పడ్డాయా? ఆడబ్బు వెనక్కు వచ్చిందా? ఒకవేళ వస్తే ఆడబ్బంతా ఏమయింది? ప్రతీ సంవత్సరం కోట్లాది ఉద్యోగాల్ని సృష్టిస్తానని కూడా నరేంద్రమోడి మాట ఇచ్చాడు. కానీ వాస్తవానికి దేశంలో నిరుద్యోగం అంతకు ముందెన్నడులేనంత ఎక్కువైంది. ఎవరూ మాట్లాడతారు? వీటన్నిటినీ ఎవరు ప్రశ్నిస్తారు? మేం వ్యవసాయుదారుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని కూడా చెప్పేరు. ఉన్న ఆదాయం కూడా లేకుండా రైతుల నోళ్ళలో మన్ను కొట్టేరు. వాళ్ళు దేనినీ మిగల్చడం లేదు. ప్రజల ఆస్తుల్ని ప్రయివేటు వారికి అమ్ముకొని వాళ్ళ బతుకులు బాగుచేసుకొంతున్నారు. విదేశీ రుణాలు అంతకుముందు ఎప్పుడు లేనంతగా పెరిగిపోయాయి. వారు వారి మెత్తని మాటలతో, గాలిమేడలు కడుతూ భారత దేశాన్ని దివాలా తీయిస్తున్నారు. విపరీతమైన ధరల పెరుగుదల, నిరుద్యొగమూ విలయ తాండవం చేస్తున్నాయి. వాళ్ళు వివిధ సామాజిక సమూహాలమధ్య అగ్గి రాజేశారు. జరుగుతున్న అంశాల నుంఛీ ప్రజల్ని పక్కదారి పట్టిస్తున్నారు. - ఇదీ వీరి పాలన. బి జె పి కి ఓటు వేసి అధికారంలోకి తెచ్చిన వాళ్ళంతా అందుకు బాధపడుతున్నారు.

వీటన్నిటి ఫలితంగా ప్రజలమధ్య ఉన్న సార్వభౌమత్వ భావన క్షీణించి పోతోంది. ప్రజలు ఎన్నుకొన్న, అధికార పీఠంలోఉన్న నాయకులకు తాము ఎన్నుకున్న ప్రజలకు ఎలాంటి జవాబుదారీ తనమూ లేకుండా పోతోంది. నేడు భారత దేశంలో రాజకీయ పార్టీల స్వభావమే ఇందుకు కారణంగా కనబడుతోంది. (1) వ్యక్తినియంత్రణలో ఉన్న పార్టీ రాజకీయాలు (2) కుటుంబ పాలనలోని పార్టీ రాజకీయాలు (౩) రాజ్యాంగేతర సంఘాలు, సంస్థలు పార్టీ రాజకీయాలను నియంత్రించడం. ఈ మూడురకాల పక్షాలు ఏదొక వైపున ఉండి వ్యవహారాలు నడిపిస్తున్నాయి. ఈమూడు రకాలూ ప్రజాస్వామ్యానికి కోలుకోలేని దెబ్బ వంటివి. నేడు దేశాన్ని నడిపించే స్థానంలో బి జె పి ఉన్నది. ఇది రాజ్యాంగేతర సంస్థలు/ సంఘాల చేతుల్లో ఉంది. ఈప్రజాప్రతినిధులవిశ్వాసమంతా ఈరాజ్యాంగేతర సంస్థలు/ సంఘాలపట్లనే ఉందికానీ, తమను ఎన్నుకున్న ప్రజలపట్ల లేదు. ఇది మిగతా అన్నిటికంటే ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకర పరిణామం. నేడు బి జె పి శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు, మంత్రులు, ఇతర చిన్నా చితకా నాయకులతోసహా అంతా బి జె పి ని నియంత్రించి శాసిస్తున్న ఆర్ ఎస్ ఎస్ ను మెప్పించి అనుగ్రహంపొందడంకోసం వెంపర్ర్లాడుతున్నారు.

మనం గమనించాల్సిన మరో ముఖ్య లక్షణం రాజ్యాంగేతర శక్తులు, సంస్థలు
పార్టీ రాజకీయాల్ని నియంత్రించడం. ఉదాహరణకు, బి జె పి లోని అత్యధిక సంఖ్యాక నాయకులు మోడీని శక్తివంతమైన నాయకునిగా చూపిన తర్వాత, ప్రధాని పీఠం అధిరోహించిన మోడీ కేవలం ఉత్సవిగ్రహం మాత్రమె. అసలు మూలవిరాట్టు ఆర్ ఎస్ ఎస్ మాత్రం సౌకర్యవంతంగా నాగపూర్ గుడిలో కూర్చుని ఉంది. ఉత్సవిగ్రహం మాత్రం దేశమంతా తిరుగుతుంటుంది. ప్రజలచేత జేజేలు కొట్టించుకుంటూఉరేగుతుంది. తన పాలనలో, సమస్యలు వచ్చినపుడు, పరిస్థితులు చేజారిపొతున్నపుడు, భావోద్వేగాలు సృష్టించి, ప్రజల్ని వేర్ర్రి వాళ్ళను చేసి, పబ్బం గడుపుకుపోయే నేర్పు ఉంటేచాలు. దాంతోబాటు అంతిమ విశ్వాసం మాత్రం మూల విగ్రహం పట్లనే ఉంటుంది. ఇదే కదా నేడు జరుగుతున్నది? మన ప్రజాస్వామ్యానికి మరో పెనుముప్పు ఏమంటే, పాలనఅంతా ఈవిధంగా రాజ్యాంగేతర శక్తుల చేతుల్లో ఉండడమే. ఇదంతా ఒక తోలుబొమ్మలాట వంటిది! ఏరకమైన వంకర పోకుండా చెప్పినట్లల్లా ఆడే తోలుబొమ్మ, ఇప్పుడున్న తోలుబోమ్మకంటే మరింత మెరుగ్గా, ఆడేది ఉంటె అది రంగ ప్రవేశం చేస్తుంది. అదే నాయక స్థానంలో కూర్చుంటుంది. అంతకు ముందున్న నాయకుడిని ఒక మూలకు తోస్తారు. పౌరులేన్నుకున్న ప్రజా ప్రతినిధుల పరిస్థితి ఇట్లా ఉంది! ఇది ప్రమాదంతోకూడినది. నేటి ప్రజాస్వామ్యానికి ఇది పెనుముప్పు.

ఇవి ప్రజల జీవనాన్ని దయనీయంగా తయారు చేస్తాయి. బి జె పి నడిపించే ప్రధాన మంత్రి, దాన్ని నడిపించే రాజ్యాంగేతర సంఘం, సంస్థ.. వీటికి నిరుద్యోగాన్ని తగ్గించడం, ధర పెరుగుదలను అడ్డుకోవడం వంటివి అవసరమా? ప్రజల ఆస్తుల్ని అమ్ముకొని ప్రభుత్వాన్ని నడపాల్సినంత అవసరం లేదు. విదేశీ అప్పు ఇంత దారుణంగా పెరిగిపోవాల్సిన అవసరం లేదు. దేశంలోని స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న రాజ్యాంగ సంస్థలు ఇంతగా నిర్వీర్యమై, కుంటి నడకన సాగాలల్సిన అవసరం లేదు. ఈ ప్రధాని మోడీ ప్రపంచంలో, కోవిడ్ 19 రాకముందు 2020 లో 2.86 లక్షలకోట్లున్న అంబానీ సంపద కేవల రెండేళ్లలో (2022 జూన్ 10 తేదీకి) 8. 3 లక్షల కోట్లకు పెరిగింది. మరోవైపు ఆదానీ సంపద ఇదే కాలంలో 2020 లో ఉన్న 69 వేల కోట్ల రూపాయలనుంచీ 7.80 లక్షల కోట్లకు పెరిగింది. (ఫోర్బ్స్ పత్రిక లెక్క ప్రకారం) భిన్న మార్గాలలో అసమానతలు పెంచాడంద్వారా, భారత దేశాన్ని తెగిన గాలిపటంలా తయారు చేశారు. ఏదేమైనప్పటికీ, ధనవంతులకు అన్నిరకాల మినహాయింపులు తగ్గింపులు ఇవ్వడంద్వారా, వారికి పన్ను మినహాయింపులు ఇవ్వడంద్వారా, వేలకోట్ల అప్పులు ఇవ్వడం, ఆ అప్పులన్నీ మాఫీ చేసి తిరిగి కొత్తగా అప్పులివ్వడం తదితర చర్యల్లద్వారా ప్రభుత్వం ఎవరికోసం పని చేస్తోందీ అర్ధమౌతోంది. దీనిపై దేశప్రజలంతా ఆలోచన చేయాల్సుంది.

దేశంలో ఏమి జరుగుతున్నదనేదానితో పని లేదు. పౌరులు నానారకాల సమస్యలతో బాధ పడుతున్నారనే అంశంతో పనిలేదు. కేవలం తీవ్ర దేశభక్తి గీతాలు పాడుకుంటూ గడిపితే చాలు. రాజ్యాంగేతర శక్తులు సంఘాలు తాము నడిపించే బీ జె పీ పార్టీద్వార చట్టాలు, సవరణలు తీసుకు వస్తాయి. మనుధర్మ శాస్త్రాన్ని చొప్పించడం, భారత రాజ్యాంగాన్ని అణగదొక్కడం, ముస్లిములు క్రైస్తవులపట్ల ద్వేష భావంతో ఉండడం, ఆర్య ఔన్నత్యాన్ని కాపాడడం వారి కార్యక్రమాలు. ఎంతకుతెగించి అయినా వీటన్నిటినీ అమలు చేయడం ముఖ్యం.వీటికోసం వేదికేట్లయితే అవి చక్కగా కనబడతాయి. బీజేపీ పాలనలోని కర్ణాటకలో 'మతస్స్వేచ్చ చట్టం' ఉదాహరణగా తీసుకుంటే, అది పైకి ఒక చట్టంలా కనబడుతుంది. దాని లోపల ఏముందీ పరికించి చూసేట్లయితే, అది భారత రాజ్యాంగాన్ని విచ్చిన్నం చేసిదిగాను, మనుధర్మ శాస్త్రాన్ని ప్రతిష్టింపజేసేదిగాను స్పష్టంగా అర్థమౌతోంది. మనమంతా మనరాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్చల్ని గురించి మాట్లాడుకుంటాం. ఐతే ఆర్ ఎస్ ఎస్ స్వేచ్చకు మరో అర్థాన్ని ఏర్పాటు చేసింది. ఆర్ ఎస్ ఎస్ నాయకుడు గురు గోల్వాల్కర్ తను రాసిన 'బంచ్ ఆఫ్ థాట్స్' పుస్తకంలో స్వేచ్చను ఇట్లా చెప్పేడు. “స్వేచ్చ అంటే మన జాతీయ విలువలను కాపాడడం, ప్రచారం చేయడం. అంటే, మనధర్మాన్నీ సంస్కృతినీ అని అర్ధం. ఆర్ ఎస్ ఎస్ బిడ్డ ఐన బిజెపికి గురు గోల్వాల్కర్ మాటలు రాజ్యాంగంతో సమానం. గురు గోల్వాల్కర్ చెప్పిన 'ధర్మ' అనేది ప్రత్యేకంగా హిందువులలో చాతుర్వర్ణ వ్యవస్థకు ప్రాతినిధ్యం వహించే అతి చిన్న సమూహానికి చెందిన భావనే గానీ, భిన్న సంప్రదాయాలున్న హిందువులు మొత్తానికి సంబంధించిన భావన కాదు. ఇట్లా ఒక చిన్న సమూహానికి మొత్తం హిందూసమాజనికి మార్గదర్సకత్వం వహించే హోదా అధికారాల్ని ఇవ్వడం నైతికంగా సమర్ధనీయమా? దీనిపై విచారణ జరపాల్సుంది. మొత్తం మతాన్ని గురు గోల్వాల్కర్ చెప్పిన విధంగా చూస్తే, మనకు భారత రాజ్యాంగం ప్రసాదించిన వ్యగ్తిగత స్వేచ్చ, భావ వ్యక్తీకరణ స్వేచ్చ, మాట్లాడే స్వేచ్చ ఏమైపోవాలి? అంతేకాకుండా, భారత దేశంలో అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న, చాతుర్వర్ణ వ్యవస్థలో హీనంగా పరిగణనకు గురయిన శూద్రులు తిరిగి అదేవిధమైన తక్కువగా చూసే శూద్రులుగానే ఉండాలా? వారు తమ జీవితాన్ని బ్రాహ్మణ, క్షత్రియ వైశ్యులకు ఊడిగం చేసేవారిగానే ఉండాలా? ఈ అంశంపై మనం తల పైకెత్తి ప్రశ్నించాల్సి వుంది.

గురు గోల్వాల్కర్ తను రాసిన 'బంచ్ ఆఫ్ థాట్స్' పుస్తకంలోరాష్ట్రాల కలయికగా ఉన్న భారత సమాఖ్య విధానాన్ని గొయ్యిలో పాతిపెట్టాలని రాశాడు. గూడ్స్అండ్ సర్వీస్ టాక్స్ (జిఎస్టి- వస్తు సేవల పన్ను) విధించడంద్వారా బిజేపి భారత సమాఖ్య విధానానికి ఒక్క కలంపోటుతో మంగళం పాడింది. పైకి చూడడానికి ఇది ఒక ఆర్ధిక సంస్కరణలా కనబడుతుంది. కానీ దానిప్రభావంవల్ల వచ్చే ప్రమాదం ఏమిటి? ఈ చర్యవల్ల రాష్ట్రాలు తమ ఆర్ధిక స్వావలంబతను కోల్పయి ఆర్దికాదికారాలన్నీ కేంద్రానికి దత్తత చెయడ మైంది. రాష్ట్రాల సొంత సంపదను కేంద్రానికి ధారాదత్తం చేసి, తమ వాటాకోసం కేంద్రాన్ని అడుక్కోవాల్సిన దుస్తితి వచ్చిన స్థితిలో మనమున్నాం. మొత్తమ్మీద, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, భారత రాజ్యాంగంలో ప్రధాన అంశంగా ఉన్న, రాజ్యాంగానికి జీవం వంటిదైసమాఖ్య ప్రభుత్వాన్ని పుడ్చిపెట్టడంద్వారా తమ గురువు గొల్వాల్కార్ కోర్కెను నేరవేర్చగలిగేరు. ఇంకా మనవైపు ద్దృష్టి సారించి, సంస్కృతాన్ని ఉమ్మడి ప్రజల భాషగా మార్చే లక్ష్య సాధనలో తొలిమెట్టుగా హిందీ భాషను అందరూవాడే దిశగా ప్రయత్నాలు ఊపందుకున్నాయి. వారి భిన్నత్వ వ్యతిరేక ఆకాంక్షలైన ‘ఒకే దేశం, ఒకే భాష, ఒకే జాతి, ఒకే నాయకత్వం’ అనే భావనలను ఆచరణలోకి తెచ్చేందుకు ఇవి సోపానాలుగా ఉన్నాయి.

విద్యా విధానానికి సంబంధించి కూడా ఇదే విధానం నడుస్తోంది. ఆర్ ఎస్ ఎస్ ఎప్పుడూ విద్యావిధానం మీద, చరిత్రమీదా తన దృష్టి సారిస్తుంటుంది. ఈరకంగా విద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలకు ఉదాహరణగా బిజిపి పాలిత కర్ణాటకరాష్ట్రంలో ఆరో తరగతి పాఠ్య పుస్తకంలో కొన్ని అంశాలు తొలగించిన సందర్భాన్ని చూద్దాం. “టిప్పు సుల్తాన్ బ్రిటీషువారికి వ్యతిరేకంగా అనేక

యుద్ధాలు చేశాడు. ఫ్రెంచ్ వారితో చేతులు కలిపి ఆంగ్లేయులను భారత దేశం నుంచీ పారదోలే ప్రయత్నం చేశాడు" వంటివి. పట్టు పరిశ్రమ, భూసంస్కరణలు, రైతులకు వాయిదాలలో రుణమంజూరీ, నాణేల ముద్రణ కోసం టంకశాల స్థాపన వంటివి ఉద్దేశపూర్వకంగ వదిలివేశారు. ఆరో తరగతి పాఠ్యాంశాలలో ఉన్న 'కొత్త మతాల ఉద్భవం' కింద అంతక్రిత జైన, బౌద్ధ మతాల్ని ప్రత్యెక మతాలుగా చూపెట్టేరు. దీన్ని మార్చి బారత దేశపు అసలు మతాలైన జైనిజం, సిక్కు మతం, బౌద్ధం హిందూ మతశాఖలుగా మార్చి, ఆ పాఠ్యాంశాన్ని ఆరో తరగతి నుంచీ ఎనిమిదో తరగతికి మార్చారు. లింగాయత మతం శాఖలుగా ఉండి, ఈ చిన్న చాతుర్వర్ణవ్యవస్తను అనుసరించే హిందూ శాఖ దాన్ని పూర్తిగా లీనం చేసుకోలేకపోయింది. భారత దేశపు గడ్డమీద పుట్టిన అసలైన మతాలు ఈ దుర్మార్గ వివక్షాపూరిత చాతుర్వర్ణ వ్యవస్తను ఆమోదించని కారణంగా వాటిని పూర్తిగా తుడిచిపెట్టేందుకు ఆర్ ఎస్ ఎస్ తీవ్రంగా కృషి చేస్తోంది.

పాఠ్య పుస్తకాల పునర్విచారణ కొత్త అంశం. బిజేపీ నాయకత్వంలోని ఎన్డియేఅధికారంలోకి వచ్చిన 1998 లో, భారత ప్రభుత్వ మానవ వనరుల అభివ్రుద్ధిశాఖ మంత్రి మురళి మనోహర్ జోషి పూజారిత్వం, కర్మకాండలు అనే అంశాన్ని పాఠశాలల అధ్యయనాంశాలలో చేర్చారు. అతను మంత్రిగా ఉన్న కాలంలో సైన్సు పునాదిగా ఉన్న ఖగోళ శాస్త్రానికి బదులు జ్యోతిష్యశాస్త్రం బోధించడం మొదలైంది. అంతే కాకుండా మగపిల్లవాడు పుట్టడం కోసం పుత్రకామేష్టి యజ్ఞం ఎట్లా చెయ్యాలో కూడా పాఠ్యాంశాలలో చేర్చారు. వారు పిల్లల మెదళ్ళలో మూడనమ్మకాలు, ముర్ఖత్వమూ పాదుకోల్పేరు. గోల్వాల్కర్ చెప్పినట్లు పిల్లలకు ఏమాత్రం ఆలోచనాశక్తి లేకుండా మూర్ఖంగా ఉంటేనే వాళ్ళు ఆర్ ఎస్ ఎస్ కార్యకలాపాల్లో పాల్గొంటారు. వాళ్ళు ఒక్కసారి అధికారంలోకి వచ్చిన తరువాత, వాళ్ళు దీన్ని పాఠశాలవిద్యావిధానంలో అమలు పరిచేందుకు చర్యలు తీసుకుంటారు. ఇటీవలికాలంలో CBSE పాఠ్యాంశాలనునుంచీ అనేక అంశాలు తొలగించడం జరిగింది. వాటిలో, ప్రజాస్వామ్యం, భిన్నత్వంలో ఏకత్వం, వ్యవసాయంపై ప్రపంచీకరణ ప్రభావం, ప్రజా ఉద్యమాలు, కులతత్వం వంటి అంశాలు పదో తరగతి పాఠాలలోంచీ ఎత్తేశారు. ఎలాఎత్తి వేయించేందుకు ఆర్ ఎస్ ఎస్ ముందుంటుంది. అది శిక్షా సంస్కృతి ఉత్తన్యాస్ అనే దాన్నొకటి ప్రవేశపెట్టింది. సిక్కుల ఊచకోతపైమాజీ ప్రధాని మన్మోహన్ సింగు గోప్పమనసుతో క్షమాపణ చెప్పడం, 2002 లో గుజరాత్ అల్లర్లలో రెండువేలమంది ముస్లిం లను హత్య చేయడం, వంటి అంశాలు పాఠ్య భాగాలనుంచీ తొలగించాల్సిందిగా ఎన్ సి ఆర్ టి పై ఆర్ ఎస్ ఎస్ నిరంతరాయంగాఒత్తిడి తెస్తూనె ఉంది, ఇది వారి కపట ఎత్తుగడ, చాతుర్యం. కనుపించని గతాన్ని కప్పివేసేందుకు తయారైన వారు ఇప్పుడు చూస్తున్నది కూడా రూపు మాపే యత్నంచేయరా?

ఈ విషయాలు ఇట్లాగే కొనసాగే పక్షంలో, భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని నిరాకరించిన ఆర్ ఎస్ ఎస్ స్థాపకుడు హెగ్డేవార్ సూక్తులు, బ్రిటీషు వలసవాద ప్రభుత్వానికి క్షమాపణ ఉత్తరం రాసి ఇచ్చి జైలు నుంచీ బయట పడ్డ వీర్ సావర్కార్ ను స్వాతంత్ర సమారయోధునిగా, వీరంతా బ్రిటీషు వారినుంచీ భారత దేశానికి స్వతంత్రం తెచ్చినవారిగా పాఠ్యపుస్తకాల్లో మనం చూసే రోజు ఒకటి వస్తుంది. అంతేకాకుండా, గాంధీని చంపిన గాడ్సే ను ఒక మహా యోధునిగా, హిందూధర్మ రక్షకునిగా అభివర్ణించే రోజుకూడా వస్తుంది. ఇదేవిధంగా ఆర్ ఎస్ ఎస్ దాని సహచరుల వీరగాధలు మాత్రమె బయటకు వస్తాయి.

దీనిగురించి ఎంతైనా చెప్పుకోవచ్చు. ఆర్యజాతి ఔన్నత్య సిద్ధాంతం
ఒక్కటి తెలుసుకుంటే చాలదా? ఆర్ ఎస్ ఎస్--- మూలవాసులకున్న ఆదివాసి అనే పదాన్ని తుడిపివేసి, దానిబదులు ‘వనవాసి’ అనే కొత్తపేరును ఆర్ ఎస్ ఎస్ రంగంలోకి దించింది. వాళ్ళ పేర్లను కూడా మార్చడం ద్వారా తన భావాల్ని న్యాయబద్ధం చేసుకునే యత్నంచేస్తోంది. ఇందుకు గల కారణాన్ని క్లుప్తంగా ఈవిధంగా చెప్పుకోవచ్చు: “ఈ ములవాసులు తమ ప్రత్యెక ఉనికిని అనుభవించడం

కొనసాగించినంతకాలం, ఈ భూమిపై వారు ప్రత్యేకంగా పరిగణనలో ఉంటారు. ఇదే దారిలో, రాజ్ గిరి అనే పురాతన సిలాజపు డి ఎన్ ఎ అధ్యయనంలో, సింధులోయ నాగరికత ఆర్య వైదిక వారసత్వం ఏకొంచం కూడా లేదని, వారీ భూమికి పరాయివారనే నిజం వెల్లడైంది. దీంతో దిగ్బ్రాంతికి గురయిన ఆర్ ఎస్ ఎస్ వారు సిందులోయ నాగరికతను 'సరస్వతీ నాగరికత' అని పేరుపెట్టి పిలవడం ప్రారంభించారు. ఆర్యులు ఎక్కడినుంచో వచ్చారని మనం అంగీకరించకపోతే ఏమైంది? భారత మాత ఇక్కడ పుట్టిన బిడ్డలందరినీ కన్నబిడ్డల్లా గుండెలకు హత్తుకుంటుంది. అంతే కాకుండా, భారత దేశంలోని పుర్వికులైన ద్రావిడులు, ఆర్యులు, ఇస్లామీయులు, క్రైస్తవులు, అంటా గుర్తుపట్టలేనంతగా కలిసి పోయారు. ఇది వాస్తవం కాగా, ఆర్ ఎస్ ఎస్ దీనిపై ఎందుకు ఆందోళన చెందాలి? అది వర్తమానంలో ఎందుకు జీవించలేకపోతోంది? దానికి ఆర్య జాతిపట్ల ఉన్న కొన్ని భ్రమలే అందుకు కారణం.

ఇంకా, హిజాబ్,హలాల్, గోమాంస నిషేధం, ఆజాన్ వంటి వాటిపై అల్లరి చేసే శ్రీరామసేన, బజరంగ్ దళ్, వంటి యువకుల ముఠాలను చూద్దాం. వీరంతా సమాజంలోని అట్టడుగు వర్గాల పిల్లలు కాదా? వారి శక్తి సామర్ధ్యాలకు తగిన ఉద్యోగ కల్పనలక్ష్యంగా దేశాభివృద్ధి ఉండాల్సిన అవసరం లేదా? ఆర్ ఎస్ ఎస్ నుంచీ పుట్టిన బిజెపి పాలకులకి ఇవన్నీ అవసరం లేదు. ఆర్ ఎస్ ఎస్ కు గానీ బిజెపికి గానీ కావాల్సింది శూద్రులు తమకు ఊడిగం చేసే వారిలానే ఉండాలనీ, వారి పరిస్థితి అభద్రతతోనేఉండాలనీ, చాతుర్వర్ణపధ్ధతి అనుసరించి తమకు సేవక స్థానంలోనే ఉండాలనీ కోరుకొంటోంది. వీరంతా కాంట్రాక్ట్ కార్మికుల్లనే ఉండాలనేది వారి ఉద్దేశ్యం. గతంలో దున్నే వానిదే భూమి అనే భావనతో ప్రవేశపెట్టిన భూసంస్కరణలను విచ్చిన్నం చేయడంద్వారా, భూమి లేని శూద్రసేవక వ్యవస్థను తిరిగి అమలు చేయాలనుకోవడంలేదా? ప్రభుత్వ శాఖలలో కాళీగా ఉన్న ఉద్యోగాలు కానీ, గతంలో రిజర్వుడు కులాలు, జాతులకు ఉద్దేశించి భర్తీ కాకుండా మిగిలిపోయిన (బేక్ లాగ్) ఉద్యోగాలుకానీ భర్తీ చేయకుండా, అనేక ప్రభుత్వ సేవలన్నీఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించని ప్రయివేటువారికి అప్పగించి, వీరందరినీ నిరుద్యోగంతో అసహాయ స్థితిలో పడేయడంద్వారా, వీరిని సేవక వర్గ స్థాయిలోకి దించే ప్రయత్నం చేయడంలేదా? అదేవిధంగా కార్మిక చట్టాల్ని మార్చి వారి హక్కుల్ని కాలరాయడంద్వారా కేంద్ర ప్రభుత్వం చేసే చర్యలలో కూడా ఇదే కనబడడం లేదా?

సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సి ఐ ఎం ఇ) అనే పరిశోధనా సంస్థ సమర్పించిన సమాచార పత్రాలప్రకారం, 2017 - 2022 సంవత్సరాలమధ్య రెండు కోట్లమంది మహిళలు భారత కార్మిక శక్తి నుంచీ అదృశ్యమయారు. ఇది సహజంగా, ఆర్ ఎస్ ఎస్ కున్న రహస్య కార్యక్రమం కింద స్త్రీలు ఇంటికే పరిమితం కావాలనే వ్యూహంఅమలు చేయడంలో భాగం కాదా? ఈ రకమైన సందేహాలు, అనుమానాలూసహజంగానే తలెత్తుతాయి.

వీటన్నిటిమధ్యా, విద్యావ్యవస్థను ప్రయివేటువారికి అప్పజేప్పడంద్వార పేదలను విద్యకు దూరం చేస్తున్నారు. దీని ఫలితంగా, గ్రామీణ ప్రాంతాలలో బాలికలు విద్యకు దూరమౌతున్నారు. ఇంతవరకే మనకు తెలిసినా, తెలియని అనేక విషయాలు మనల్ని వేటాడుతున్నాయి. మనం ఏమి చేయాల్సుంటుంది? ఎట్లా చేయాల్సుంటుంది? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం ఏమైనా ఉందా? పట్నంలో దొంగలున్నారు. మనం ఏమి చేస్తాం? మనల్ని మనం ఎట్లా కాపాడుకుంటాం? ముందుగా పట్నం మొత్తం మేలుకోవాలి. యువకులంతా రాత్రి గస్తీ తిరగాలి. స్త్రీలు వారివెంట కారప్పొడిని సిద్ధంగా ఉంచుకోవాలి. ఈ రకమైన చైతన్యం, నిఘా మనందరికీ అవసరం. ఎందుకంటే, ఈ దొంగలు నానారకాల వేషాల్లో వస్తారు. ఉదాహరణకు వారు దేవాలయ నిర్వహణకు రావచ్చు. తప్పుడు పుకార్లు సృష్టించవచ్చు. భక్తి గీతాలు నిర్వహించవచ్చు. చేపలకు గాలం వేసినట్లు మన భావోద్వేగాలను రెచ్చగొట్టే అంశాలద్వారా మొత్తం సముహాన్నే వలలో వేసుకునే ప్రయత్నం చేయవచ్చు. ముందుగా వారి నిజస్వరుపాల్ని బయటపెట్టడం ఒక్కటే మనముందున్న మార్గం. ఇందుకై మనం ఎంతో

నిఘాపెట్టడం అవసరం. అంతే కాకుండా, కనీసం ఇప్పటికైనా, సరయిన గొంతుకలు (అక్కడక్కడా అయినా) ఏది మంచి, ఏడూ చెడు అనే అంశాలపై గొంతు విప్పాలి. ప్రేమ, సహనం, న్యాయం వంటి పదాలు మన సమాజం నుంచీ వినబడే కృషి చేయాలి.

*మతమార్పిడి నిరోధక చట్టాన్ని గురించి

బిజేపీ పాలిత కర్నాటక రాష్ట్రంలో ఇటీవల 'కర్నాటక మతస్వేచ్చా రక్షణ బిల్లు (protection of Right to Religious freedom 2021) ని శాసన సభలోప్రవేశపెట్టి హడావిడిగా ఆమోదించారు. ఒక ఆర్డినెన్స్ ద్వారా మంత్రివర్గం ఆమోదంతో, గవర్నర్ సంతకమై, అదిప్పుడు చట్టరూపందాల్చింది. పైకి దీని పేరు మాత్రం 'మత స్వేచ్చా రక్షణ' దానిలోపలి అంశాలు జాగ్రత్తగా చదివితే, ఆ బిల్లు మత మార్పిడులను నిషేధించడానికనేఅంశం స్పష్టంగా అర్థమౌతోంది. ఈమొత్తం చట్టాన్ని పరికించి చుస్తే, అందులో ఎక్కడా మతస్వేచ్చను గురించిగానీ, హక్కుల్ని గురించి గానీ, ఈ చట్టం ఇచ్చే ఏదైనా రక్షణ గురించికానీ ఎక్కడా లేదు. దీనికి స్వేచ్చ అని పేరు పెట్టినా, చట్టంలో ఉన్న అంశాలు మాత్రం స్వేచ్చల్నిఎట్లా నాశనం చేయవచ్చనే మార్గాలని గురించి మాత్రమె చెపుతోంది. అందువల్లనే ప్రజలు దాన్ని, దాని అసలు ఉద్దేశ్యం ఏముందో, అదే ప్రకారం 'మతమార్పిడి నిరోధక చట్టం' అని పిలుస్తున్నారు.

ఇంతవరకూభారతదేశ చరిత్రలో ఏ పాలకుడు, రాజు లేదా చక్రవర్తిగానీ, మతమార్పిడులను నిషేధిస్తూ చట్టం చేసిన దాఖలాలు ఎక్కడా కనబడడంలేదు. భారతదేశం అన్ని మతవిశ్వాసాలు,మతశాఖలు, భిన్న ఆథ్యాత్మిక ప్రయోగాలకు వేదికగా ఉండింది. ఇదే భారతీయ వారసత్వం. పెళ్ళితో యుద్ధం అంతమౌతుందని చరిత్రకారులన్నారు. భారతీయ పురాణాలలో కూడా, దేవుళ్ళు, దేవతలు, పోరాడి గెలిచారు, ఓడేరు, చివరకు పెళ్ళిళ్ళు చేసుకొని కలిసిపోయి సుఖంగా కాపురాలు చేసుకున్నారు. ఐతే, భక్తులుగా చెప్పుకునే వీరు మాత్రం అసహనం, ద్వేషం, కులతత్వం వంటి స్థితిలో, పుట్టుకతోనే సమాజ స్థారంలో వ్యక్తీ అంతస్తును నిర్ణయించే భావాలమధ్య జీవిస్తున్నారు. ఆర్ ఎస్ ఎస్ నిజమైన కోర్కెలను సాకారం చేసేందుకు కృషి చేస్తున్న బిజెపి ముఖ్యంగా చాతుర్వర్ణ వ్యవస్థను ప్రతిస్తించడానికి పూనుకొని, దేశాన్ని గతంలోకి నడిపిస్తోంది. ఇది కూడా అందకారపు గతాన్ని పునరుద్ధరించడంలో బాగంగానే జరుగుతోంది.

ఈ చట్టంలో, ఏ వ్యక్తీ అయినా మతాన్ని మారాలనుకున్నట్లయితే, దానికి అన్నిరకాల అవరొధాలనూ చట్టంలో ఏర్పరిచారు.ఇదంతా మత స్వేచ్చ రక్షణ ముసుగులోనే జరుగుతోంది. మత మార్పిడి జరగడం సప్త సముద్రాల నీళ్ళు తాగి వచ్చినంతటి అసాధ్యం. మతం మార్చుకోవాలనుకునే వ్యక్తీ ఇప్పుడు కనీసం ఒక నెలరోజుల ముందుగా ఫారం I లో ఒక ప్రకటనను జిల్లా కలక్టర్ కు సమర్పించాల్సి ఉంటుంది. అదే విధంగా మత మార్పిడి తంతు నిర్వహించే మతపెద్దకూడాఫారం ii లో ప్రకటన చేయాల్సుంటుంది. ఆపై దీనిపై అభ్యంతరాల్ని ఆహ్వానిస్తారు. దీనిపై ఏ బంధువైనా, ఇరుగు పొరుగు వ్యక్తయినా, సహోద్యోగి అయినా అభ్యంతర పెట్టవచ్చు. ఇది ఎంత చోద్యంగా ఉందొ చూడండి! ఒక వేళ ప్రలోభాపెట్టో, బలవంతానో మతమార్పిడి జరిపేట్లయితే అందుకు అభ్యంతరం చెప్పాల్సింది మతం మార్చుకొనే వ్యక్తీ కాదా? ప్రభుత్వం ప్రజల జీవితాలతో ఎంత పనికిమాలిన విధంగా నియంత్రణ జరుపుతోందో చూడండి.

అంతేకాకుండా, ఈ మతమార్పిడి తంతు నిర్వర్తనకు సంబంధించి లోపాలకు ఏమైనా శిక్ష విధించే అవకాశమున్నప్పుడు ఎట్టిపరిస్థితుల్లోనూ దీన్ని నిర్వర్తించడానికి ఎవరూ ముందుకు రారు. ఈ మతమార్పిడులు స్వచ్చందంగా జరిగిన చోట్లకూడా, దీన్ని వంచనతోగానీ, మోసపూరితంగా కానీ, బలవంతంగా కానీ, పలుకుపడి, అధికారాలను ఉపయోగించిగానీ తప్పుగా అభివర్ణించి శిక్షించేందుకు, మార్పిడి తంతు నిర్వహించే వారిని శిక్షించేందుకు అవకాశముంది. స్వచ్చందంగా మతమార్పిడి చేసుకోవాలనుకువారు ఏమి చేయాలి? వారు ముందుగా ఫారం I లో ఒక

ప్రకటనను జిల్లా కలక్టర్ కు దరఖాసు చేసుకోవాల్సుంటుంది. హాస్యాస్పదంగా రాజ్య యంత్రాంగం ఆ మార్పిడులకు ఏర్పాట్లు చేయాలని కోరాల్సి వుంటుంది.

ఇందుకు బదులుగా, స్వయంగా నిర్ణయం తీసుకోలేని మానసి అనారోగ్యమున్నవారు, పిల్లలు, మతమార్పిడికి అనర్హులుగా చట్టం చేస్తే హేతుబద్ధంగా ఉండేది. ఇక్కడ బాధాకరమైన విషయమేమంటే, ఒకవేళ స్త్రీలు దళితులూ గనుక మతమార్పిడి చేసుకోవాలనుకున్నట్లయితే, ఈ ప్రభుత్వ చట్టం వారి ఆత్మాభిమానానికి గొడ్డలి పెట్టుగా పరిణమిస్తున్నది. స్త్రీలు, దళితులూ, మానసికారోగ్యం సరిగా లేనివారు, స్వయంగా నిర్ణయాలు తీసుకోలేరు. ఈ చట్టంలో వికలాంగులు పిల్లలు కూడా ఇదేవిధంగా పరిగణించ బడ్డారు. స్త్రీలు, దళితులంకు మతమార్పిడి తంతు నిర్వహించే వారికి తీవ్ర సిక్షలు ఉంటాయనేదానికి ఇదే సాక్ష్యం. కాబట్టి స్త్రీలు, దళితులూ మతి స్థిమితం లేనివారా? ఈ ప్రభుత్వ ఉద్దేశం ఏమిటి? స్త్రీలు, దళితులూ తెలివిలేనివాళ్ళుగానూ వేరేవారి సహాయం లేకుండా సొంతగా నిర్ణయాలు తీసుకోలేని, నిర్ణయం తీసుకునే శక్తి లెనివారిగా ఈ ప్రభుత్వ ఉద్దేశంగా కనబడుతోంది. ఈ చట్టాన్ని రుద్దిన ప్రభుత్వం ఒక్క విషయాన్ని గుర్తుంచుకోవాల్సుంది. వారు అత్యధిక సంఖ్యలో స్త్రీలు, దళితుల ఓట్ల తోనే అధికారం చేపట్టేరు. ఐతే ఏమాత్రం విశ్వాసం లేని వీళ్ళు ఏమిచేస్తున్నారు? వీళ్ళను రెండో తరగతి ప్రజలుగా చేసి, వారి పట్ల వివక్ష చూపుతూ హింసిస్తున్నారు. రాబోయే ఎన్నికలలో స్త్రీలు, దళితులూ, వీళ్ళను సోదిలోకి లేకుండా ఓడించాడంద్వార తప్పు సరిదిద్దుకోవాల్సుంటుంది. వీరు అసలు విషయాల్ని తెలుసుకుని, ఆరకమైన ఎన్నికైన ప్రజా ప్రతినిధులను ఓడించడంద్వారా తాము సొంతగా నిర్ణయాలు తీసుకోగలమని తెలియజేప్పాల్సుంటుంది. స్త్రీలు, దళితులూ, చైతన్యవంతమై, శాసన సభలో ఇటువంటి బిల్లులపై ఏమాత్రం చర్చ లేకుండా గుడ్డిగా చేతులేత్తడాన్ని ప్రశ్నించాల్సుంది.

ఈ అంశంపై వాస్తవంగా ప్రభుత్వం ఏమిచేస్తోంది? వీళ్ళు మాటల్లో మతస్వేచ్చను గురించి మాట్లాడుతూ, ఒక్క దెబ్బతో రాజ్యాంగం ప్రసాదించిన వ్యక్తిగత స్వేచ్చా భావనకు నడుము విరగ్గొట్టి, చేతల్లో మతమార్పిడులను నిషేధించే విధంగా పని చేస్తున్నారు. “మతస్వేచ్చకు కట్టుబడి ఉండి, వ్యక్తిఇష్టాయిష్టాల్నిబట్టి ఏమతాన్నయినా అవలంభించడానికి, ప్రొత్సహంచడానికీ" రాజ్యాంగం ప్రసాదించిన హక్కును కాలదన్నేరు. అంతేకాకుండా స్త్రీలు, దళితుల్ని రెండోస్థాయిపౌరులుగా దిగజార్చి హింసకు గురి చేశారు.

దీని సారాంశమంతా ఒక్క ఉదాహరణతో స్పష్టమౌతోంది. మతమార్పిడుల నిరోధం సందర్భంగా శాసన సభలో ఒక ప్రహసనం చోటు చేసుకుంది. హాస్దుర్గ నుంచీ ఎన్నికైన, బట్టలు చించుకునేవానిగా పేరుబడ్డ బిజెపికి చెందిన ‘గోలిహట్టి శేఖర్’ అనే ఎమ్మెల్యేతన తల్లి క్రైస్తవ మతంలోకి మారడాన్ని గురించి వివరించాడు. ఆమె అట్లా ఎందువల్ల క్రైస్తవ మతం పుచ్చుకుందనే అంశం ఎవరి బుర్రకూ తట్టలేదు. బహుశా ఆ ఎమ్మెల్యే తల్లి గురయిన నిరాశా నిస్పృహలుక్రైస్తవం వైపు నేట్టివుండొచ్చు కదా? ఆమె బాదలు ఎవరికీ పట్టవు. ఆమెకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కుగా ఉన్న మతస్వెచ్చ హక్కు వర్తించదా? ఏ ఎమెల్యే కూడా దీన్ని పట్టించుకోలేదు. ఒక స్త్రీ కుమార్తెగా ఉన్నప్పుడుతండ్రి అధీనంలోను, పెళ్లి తర్వాత భర్త ఆధీనంలోను, విధవగా మారేక కొడుకు ఆధీనంలోను ఉండాల(పితారక్షతేకౌమారే, భర్తా రక్షతి యౌవనే , రక్షంతిస్థానిరేపుత్రా నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి) " అనే మనుధర్మ భావనలే ఇందుకు కారణం. మొత్తమ్మీదాఇక్కడ జరిగిందేమంటే, రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి మనుధర్మ శాస్త్ర తత్వాన్ని ప్రతిష్టించడం.

ఆర్ధిక బలహీన వర్గాలవారికి రిజర్వేషన్ల కల్పన ఉదంతం కూడా
రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి, మనుధర్మ శాస్త్రాన్ని అమలుపరచడం కిందికే వస్తుంది. విద్యా ఉద్యోగాలలో సరయిన ప్రాతినిధ్యం లేకపోవడాన్ని, సామాజిక అంతస్థువిద్యాస్తాయిలలో ఉండే అంతరాలు తగ్గించి, సామాజిక న్యాయం దిశగా

చర్యలు తీసుకోవడమే రిజర్వేషన్లు కల్పించడంలోని అంతరార్ధం. ఈ పద్ధతిలో న్యాయముంది. ఆర్ ఎస్ ఎస్, బిజెపి లకు ఒకే నాయకుడుగా ఉన్న ప్రధాని మోడీ ఒక్క కలం పోటుతో, ఆర్ధిక బలహీన వర్గాలవారికిపదిశాతం రిజర్వేషన్లను కల్పించాడు. దీంతో, అంతకు ముందు రిజర్వేషన్ భావనలో ఉన్న "సామాజిక న్యాయం" అనే భావనకు తూట్లు పడ్డాయి. దాని మౌలిక స్వభావం కూడా నాశనమైంది. కొంతకాలం వెనక్కు వెళ్ళేట్లయితే, వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించే ఉద్దేశంతో మండల కమిషన్ పై జరిగిన ఉద్యమాల సందర్భంగా, దాన్ని వ్యతిరేకించిన ఆర్ ఎస్ ఎస్ చాలా సమూహాల్ని దూరం చేసుకుంది. ఆసమయంలో ఒక అమాయక నిరసనకారుడు మరణించాడు. ఆరకమైన నేపధ్యాన్ని దృష్టిలో ఉంచుకున్న మోడీ తానూ ప్రధాని అయిన తరువాత, ఆర్ధిక బలహీన వర్గాలవారికి పదిశాతం రిజర్వేషన్లనుకల్పించడంద్వార రాజ్యాంగానికి లోపలినుంచే తూట్లు పొడిచాడు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడమే అతని ఉద్దేశం. ఈ అగ్రవర్ణాలవారి జనాభా షుమారు ఐదు శాతమే ఉన్నా, ఇప్పటికే విద్యా ఉద్యోగాల్లో వారు అత్యధిక శాతంగా ఉన్నా, మళ్ళీ వారికి పది శాతం రిజర్వేషన్లను కల్పించాడంద్వారా మోడీ సామాజికంగా వారికి మరింత లాభం చేకూర్చాడు. ఈ ఆర్ధిక బలహీన వర్గాలవారికి పదిశాతం రిజర్వేషన్లనుకల్పించే (అగ్ర వర్ణాలకు మరింత లాభం చేకూర్చే) వరం కూడా మనుధర్మ న్యాయానికి సంబంధించిందే! ప్రభుత్వంతో అన్యాపు చట్టాల్నిచేయించాడంద్వారా ఆర్ ఎస్ ఎస్ దేశంలో ఒక విషపూరిత వాతావరణం సృష్టించింది.

ఈయథాతథాను వాదం దోషరహితంగా తెచ్చేందుకు శాయశక్తులా కృషి చేశాను. అక్షరదోషాలు, వాక్యనిర్మాణ దోషాలవంటివి ఏమైనా గుర్తిస్తే, - అనువాద శ్రేష్టత గురించి తప్పని సరిగా యాఖ్యానించగోరతాను. అనిసెట్టి శాయికుమార్